మేజర్ చెరువుకు నీటి ఎద్దడి

వందలాది సంవత్సరాలుగా సాగునీరు అందిస్తున్న ఆత్మకూరు మేజర్ చెరువుకు నీటి ఎద్దడి ఏర్పడనుంది. దీనివల్ల సమీప 20 గ్రామాల్లోని రైతాంగానికి సాగునీటి కష్టాలు రానున్నాయి. ప్రత్యామ్నాయం చూపాల్సిన అధికారులు బుజ్జగింపు చర్యలకు పాల్పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

- ప్రధాన నీటి వనరులైన బొగ్గేరు, కొండవాగులకు అడ్డుకట్టల ఏర్పాటు
- ఆందోళనలో రైతులు



ఇసుకపల్లి రిజర్వాయర్ కోసం బొగ్గేరుకు మట్టితో ఏర్పాటు చేస్తున్న అడ్డుకట్ట

ఆత్మకూరు : ఏడు శతాబ్దాల క్రితం శ్రీకృష్ణదేవ రాయల పాలనలో సైన్యాధ్యక్షుడు తిమ్మరాజయ్యచే ఆత్మకూరు చెరువును తవ్వించారు. దీనికి బొగ్గేరు, కొండవాగుల ద్వారా నీరు సరఫరా అవుతుంది. కాలక్రమేణా తాగునీటి వనరులను ప్రత్యేకంగా ఏర్పరుచుకోవడంతో ఈ చెరువు ద్వారా సాగునీరు సరఫరా అవుతోంది. అనంతర పరిణామాల్లో ఇది మేజర్ చెరువుగా రూపాంతరం చెందడం, సోమశిల జలాశయం నుంచి నీటి సరఫరా జరగడం లాంటివి చోటు చేసుకున్నాయి.

హైలెవల్ కెనాల్ నిర్మాణానికి ప్రతిపాదన


సోమశిల జలాశయం నుంచి ఆత్మకూరు నియోజకవర్గంలోని వెనుకబడిన మండలాలతో పాటు ఉదయగిరి నియోజకవర్గానికి సాగు, తాగునీరు అందించేందుకు హైలెవల్ కెనాల్‌ను డిజైన్ చేశారు. దివంగత వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు కెనాల్‌ను మంజూరు చేశారు. ఆయన మరణానంతరం కొంత మేర నిర్మాణాలు మొదలుపెట్టి సాగుతున్నాయి. ఈ కాలువ నిర్మాణాల్లో భాగంగా ఏడు గ్రామాల్లో ప్రత్యేక రిజర్వాయర్ల ఏర్పాటుకు డిజైన్ రూపొందించారు. ఇందులో పొంగూరు, ఇస్కపల్లి, కదిరినాయుడుపల్లి తదితర ప్రాంతాల్లో రిజర్వాయర్లు నిర్మించేలా ప్రణాళికల్లో పొందుపరిచారు. వీటిలో ఇస్కపల్లి వద్ద రిజర్వాయర్‌కు సంబంధించి బొగ్గేరుకు అడ్డుగా నిర్మాణం చేపట్టాల్సి ఉంది. దీంతో బొగ్గేరు నీటి సరఫరా ఆత్మకూరు చెరువుకు నిలిచిపోతుంది. దీనివల్ల ఒక్క ఆత్మకూరుకే కాకుండా సుమారు 20 గ్రామాల్లోని చిన్న చెరువుల సాగునీటికి గండి ఏర్పడే ప్రమాదం ఉంది. ఈకారణంగా ఆత్మకూరు చెరువుకు సాగునీటి కోసం పూర్తిగా ఉత్తరకాలువ జలాలపైనే ఆధారపడాల్సి పరిస్థితి నెలకొంటుంది. అయితే ఉత్తరకాలువ నీరు కూడా పూర్తిస్థాయిలో ఆత్మకూరుకు ప్రస్తుతం చేరడం లేదు. దీనికి కారణం ఉత్తరకాలువ ద్వారా వచ్చే సోమశిల జలాశయం నీరు చీలుకాలువ ద్వారా బోయలచిరివెళ్ల వద్ద ఉన్న బొగ్గేరులో సాగి గొల్లపల్లి వద్ద ఉన్న సైఫన్ దగ్గర నుంచి ఏటీఎస్ కెనాల్ ద్వారా ఆత్మకూరు చెరువుకు చేరాల్సి ఉంది. అయితే బొగ్గేరులో నీరు సాగే సమయంలో అధిక శాతం అక్కడే ఇంకుతుంది. సిమెంట్ లైనింగ్ నిర్మాణం జరగకపోవడంతో ఇసుకలోనే ఏటీఎస్ కెనాల్ వరకు నీరు సాగాల్సి ఉంది. దీంతో ఎంతో నీరు వృథా అవుతుంది. దీనికితోడు ఏటీఎస్ కెనాల్‌లో ఏటా విపరీతంగా జమ్ము, తూటాకు పేరుకుపోతుండడంతో సజావుగా ఆత్మకూరు చెరువుకు నీరు చేరే పరిస్థితి లేదు. ఇందుకోసం ఇప్పటికే ఏటా పది నుంచి రూ.15 లక్షల వ్యయం చేయాల్సిన పరిస్థితి ఉంది. అందుకే సోమశిల జలాలు పూర్తిస్థాయిలో ఆత్మకూరు చెరువుకు చేరడంలేదు. అలాంటి పరిస్థితుల్లో బొగ్గేరు నీరు ఆధారంగా చెరువు నిండుతోంది. భవిష్యత్‌లో బొగ్గేరుకు అడ్డుగా రిజర్వాయర్ పనులు పూర్తయితే చెరువు పరిస్థితి ప్రశ్నార్థకమవుతుంది.



నీటి సరఫరా తగ్గిపోవడంతో చుక్కనీరు లేని బొగ్గేరు

ప్రత్యామ్నాయ పనులు చేస్తే మేలు

బోయలచిరివెళ్ల వద్ద బొగ్గేరులో ఉత్తరకాలువ నీరు ప్రవహించే కాలువకు పూర్తిస్థాయి లైనింగ్ పనులు చేయాల్సి ఉంది. ఏటా ఏటీఎస్ కెనాల్‌లో జమ్ము, తూటాకును చిన్నస్థాయిలో ఉన్నప్పుడే తొలగించే పనులు చేయాలి. ఇలా చేస్తేనే సోమశిల జలాలు ఆత్మకూరు చెరువుకు సజావుగా సాగుతాయని పలువురు సూచిస్తున్నారు. దీనివల్ల ఆత్మకూరు చెరువు నిండి 11 గ్రామాల రైతాంగాన్ని ఆదుకొనే పరిస్థితులు ఏర్పడుతాయని పేర్కొంటున్నారు. మరి ఉన్నతాధికారులు హైలెవల్ కెనాల్ రిజర్వాయర్లు పూర్తికాక ముందే మేజర్ చెరువు అయిన ఆత్మకూరుకు సజావుగా నీరు సరఫరా అయ్యేలా ప్రత్యామ్నాయ పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



సోమశిల జలాశయం నుంచి హైలెవల్ కెనాల్ బ్లూ ప్రింట్

క్లుప్తంగా

నేత్రపర్వంగా సీతారాముల కల్యాణం

ఉదయగిరి రూరల్ : మండలంలోని గానుగపెంటపల్లి గ్రామంలో సీతారాముల కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకాలు, విశేష పూజలు, అలంకరణలు చేశారు. వేద పండితులు శాస్త్రోక్తంగా కల్యాణ తంతును ముగించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసింది.

కన్యకాపరమేశ్వరికి కుంభాభిషేక మహోత్సవం



నవగ్రహ పూజలు చేస్తున్న శృంగేరి శారదా పీఠాధిపతి

కావలి (జలదంకి): పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయ పునః ప్రతిష్ఠ కుంభాభిషేక మహోత్సవాలు ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి ప్రాణప్రతిష్ఠ, హోమ పూజలు, మహా పూర్ణాహుతి తదితర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శృంగేరి శారదా పీఠాధిపతి విధుశేఖర భారతిచే మహా కుంభాభిషేక మహోత్సవం జరిగింది. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు.

ఉదయగిరిలో తేలికపాటి వర్షం



ఉదయగిరి : పట్టణంలో ఆదివారం సాయంత్రం తేలికపాటి వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తీవ్రత ఉండగా, ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షం పడింది. గత రెండు రోజులుగా సాయంత్రం పూట వర్షం కురుస్తుండడంతో ప్రజలు ఎండ వేడి నుంచి ఉపశమనం పొందుతున్నారు.

జేవీవీ మండల కమిటీ నియామకం



గోపినాథ్‌కు సత్కారం

మర్రిపాడు : మర్రిపాడు యూటీఎఫ్ కార్యాలయంలో జనవిజ్ఞాన వేదిక మండల నూతన కమిటీని ఆదివారం నియమించారు. గౌరవాధ్యక్షులుగా డాక్టర్ గోపినాథ్, ఆరికట్ల పుల్లయ్య, అధ్యక్షుడిగా ఎంవీ సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసులు, కె.వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శిగా రసూల్‌బాబుతో పాటు పది మంది సభ్యుల నియామకం జరిగింది. అనంతరం గోపినాథ్‌ను సత్కరించారు. రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, కొక్కంటి పోలయ్య, వివిధ సంఘాల నాయకులు మూలి వెంగయ్య, మూలి ప్రమీల, వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధ మహోత్సవం



సంగం : మండలంలోని దువ్వూరు గ్రామంలో ఆస్తానా ఏ నూరియా దర్గాలో గంధ మహోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అలహాజ్ హజరత్ షేక్ షా నూరి సాహెబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్తాన ఏ నూరియా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌గా జనార్దన్‌నాయుడు?

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మర్రిపాడుకు చెందిన టీడీపీ మండలాధ్యక్షుడు ఆరికట్ల జనార్దన్ నాయుడు పేరు ఖరారు కానున్నట్లు సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

జాతీయస్థాయి పోటీల్లో ఆత్మకూరు విద్యార్థుల ప్రతిభ



ఆత్మకూరు : ఆత్మకూరుకు చెందిన కందుకూరి మనోజస్వంత్, ఎస్.వెంకట విఘ్నేష్ అనే విద్యార్థులు గోవాలో జరిగిన జాతీయస్థాయి జూనియర్ రౌండ్ నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి కాంస్య పతకాన్ని సాధించారు. ఈ క్రమంలో వారితో పాటు పీడీ తిరుపతయ్యకు ఆత్మకూరు ప్రజలు, ఉపాధ్యాయులు ఆదివారం అభినందనలు తెలిపారు.

శోభాయాత్రకు తరలిరండి



ఆత్మకూరురూరల్ : ఈనెల 25న ఆత్మకూరులో నిర్వహించే హనుమాన్ శోభాయాత్రకు ప్రజలు భారీ సంఖ్యలో తరలి రావాలని నిర్వాహకుడు పుల్లారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దేపూరులో ఆదివారం రాత్రి నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన హాజరై, మాట్లాడారు. హిందూవులందరూ పాల్గొని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం శోభాయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు.

ముగిసిన కనకదుర్గమ్మ ఉత్సవాలు



ఉత్సవ రథాల ముందు ఏర్పాటు చేసిన పండరి భజనలు



కనకదుర్గమ్మ అమ్మవారికి పాలపొంగళ్లు సమర్పిస్తున్న మహిళలు

ఆత్మకూరురూరల్ : మండలంలోని రామస్వామిపల్లిలో మూడు రోజులుగా జరుగుతున్న కనకదుర్గమ్మ ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు, ఉత్సవాలు నిర్వహించారు. అనంతరం శివపార్వతులు, హనుమత్ సమేత సీతారాములు, రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణుడు తదితర దేవదేవేరులు గ్రామోత్సవాలు నేత్రపర్వంగా సాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చివరిగా గ్రామానికి చెందిన మహిళలు భక్తిశ్రద్ధలతో కనకదుర్గమ్మ దేవాలయం వద్ద పాలపొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ధర్మకర్త కొప్పోలు పుల్లారెడ్డి, కమిటీ సభ్యులు కేసీ నారాయణ, శ్రీనివాసులురెడ్డి, వెంకట రమణయ్య, మెంతెం వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు

ఉదయగిరి రూరల్ : మండలంలోని దేకూరుపల్లి గ్రామంలో పోలేరమ్మకు ఆదివారం పొంగళ్లు పొంగించారు. తొలుత మహిళలు పొంగలి సామగ్రిని బుట్టలో పెట్టుకుని గ్రామోత్సవంగా బయలుదేరి ఆలయానికి చేరుకున్నారు. ప్రదక్షిణలు చేసి పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ముగిసిన సీతారాముల ఉత్సవాలు

మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం నుంచి ప్రారంభమైన సీతారాముల ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వసంతోత్సవం, పార్వేట గావించారు.

దేశం గర్వించేలా ఆపరేషన్ సిందూర్



భారీ జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న మహిళలు

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు : భారతదేశం గర్వించేలా ఆపరేషన్ సిందూర్ జరిగిందని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఆత్మకూరు పట్టణంలో ప్రజలు, అధికారులు, పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు, విద్యార్థులచే ఆదివారం సాయంత్రం తిరంగ యాత్ర నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ర్యాలీని మంత్రి ఆనం జెండా ఊపి ప్రారంభించారు. తొలుత యుద్ధంలో వీర మరణం పొందిన మురళీనాయక్‌కు నివాళులర్పిస్తూ జోహార్లు పలికారు. ఈ యాత్ర పోలీస్‌స్టేషన్, జేఆర్‌పేట, బీఏస్సార్ సెంటర్, మున్సిపల్ బస్టాండ్ మీదుగా సత్రం వరకు సాగింది. అనంతరం ఆనం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైనికులకు అండగా ఉండాలన్నారు. కాగా యాత్రలో ఏర్పాటు చేసిన కోలాటాలు, పండరి భజనలు ప్రజలను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీఓ పావని, తహసీల్దార్ సోమ్లానాయక్, ఎన్‌డీసీసీబీ బ్యాంక్ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, వివిధ పార్టీల నాయకులు టి.గిరినాయుడు, ఆంజనేయరెడ్డి, కె.రవీంద్రారెడ్డి, దావా పెంచలరావు, పలు శాఖల అధికారులు, కూటమి పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో యాత్రను ప్రారంభిస్తున్న మంత్రి ఆనం

‘స్థలాన్ని ఆక్రమించి ఇబ్బందులు పెడుతున్నారు’

కొండాపురం : మా స్థలాన్ని ఆక్రమించి ఇబ్బందులు పెడుతున్నారని గూడవళ్లూరు గ్రామానికి చెందిన పాటిబండ్ల సుబ్బమ్మ, ఆమె కుమారుడు వెంకటేశ్వర్లు వాపోయారు. ఈ మేరకు వారు ఆదివారం విలేకరులతో మాట్లాడారు. సర్వే నంబర్ 629లో గ్రామానికి చెందిన 32 మందికి 2003లో ఐదు సెంట్లు వంతున్న ఇంటి స్థలానికి పట్టాలు ఇచ్చారన్నారు. అప్పటి నుంచి ఆ స్థలంలో గడ్డివాములు వేసుకుంటున్నామని తెలిపారు. అదే సర్వే నంబర్‌లో చిమ్మిలి నాగేశ్వరమ్మకు ఐదు సెంట్లు ఇచ్చారన్నారు. ఈ క్రమంలో ఆమె కుమారుడు రవీంద్ర, కుమార్తెలు బేబి, కవితలు తమ స్థలాన్ని ఆక్రమించి మమ్మల్ని ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు స్పందించి తమ స్థలాన్ని ఇప్పించాలని కోరుతున్నారు.

‘టీడీపీ నేత అడ్డు తగులుతున్నారు’

జలదంకి: మండలంలోని రామవరప్పాడు గ్రామంలో తమ తల్లిదండ్రుల సమాధులను శ్మశానవాటికలో నిర్మించుకోనీయడం లేదని గ్రామానికి చెందిన ఉదయ్‌కుమార్ ఆదివారం వాపోయారు. ఆయన ఆదివారం గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల తన తల్లిదండ్రులు మరణించడంతో వారి సమాధులు శ్మశానవాటికలో నిర్మించుకోవడానికి ప్రయత్నించగా సర్పంచ్ భర్త, టీడీపీ నేత ఉన్నం రవి మీకెందుకు సమాధులు అంటూ తమను అడ్డుకున్నారని తెలిపారు. తాము దళితులమని, తమకు న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. పోలీసులు తమకు న్యాయం చేయాలని కోరారు.

ఇంటి స్థలాలకు దరఖాస్తుల ఆహ్వానం

కలిగిరి : గ్రామాల్లో సొంత ఇళ్లు లేని వారు స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీఓ ప్రత్యూషారెడ్డి ఆదివారం తెలిపారు. ఆధార్, రేషన్‌కార్డుతో సంబంధిత గ్రామ సచివాలయ పరిధిలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

మొబైల్ ఫోన్ చోరీ

కావలి (జలదంకి): కావలి పట్టణంలోని పోస్టాఫీస్‌లో పనిచేస్తున్న సురేష్‌కుమార్ శనివారం విధుల్లో ఉన్నప్పుడు మొబైల్ ఫోన్ చోరీకి గురైంది. దీంతో అతను ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కావలి ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నాగార్పమ్మకు పొంగళ్ల సమర్పణ

ఆత్మకూరురూరల్ : మండలంలోని బంట్లపల్లిలో నాగార్పమ్మ తిరునాళ్ల సందర్భంగా రెండో రోజు ఆదివారం మహిళలు పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించి అనంతసాగరం మండలం కచ్చేరిదేవరాయపల్లి వద్ద పెన్నానదిలో అమ్మవారి స్నానాన్ని భక్తిశ్రద్ధలతో గావించారు.

తగిన జాగ్రత్తలు పాటించాలి

మర్రిపాడు : డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రానికి బేళ్లను తీసుకొచ్చే రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ముందురోజు వచ్చి చూసి ఏ రకం పొగాకు అమ్ముడుపోతుందో చూసుకుని ఆ రకాన్ని మాత్రమే తీసుకురావాలని కోరారు.

20 నుంచి హనుమత్ జయంత్యుత్సవాలు

కావలి (జలదంకి): కావలి మండలం మద్దూరుపాడులో వెలసిన ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు హనుమత్ జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గుత్తికొండ కిషోర్‌బాబు, పోతుగంటి శ్రీధర్, మట్టా వెంకట సుబ్రహ్మణ్యంలు ఆదివారం తెలిపారు. ఆలయంలో మూడు రోజుల పాటు అర్చకుడు రమేషాచార్యుల ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహిస్తామన్నారు.

- సీతారామపురం : మండలంలోని మారంరెడ్డిపల్లి గ్రామంలో ఈనెల 22న హనుమాన్ జయంతి మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఉదయం అభయాంజనేయుడికి విశేష పూజలు, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం గ్రామదేవత అంకాలమ్మకు నైవేద్యం, రాత్రి స్వామివారికి ఆకుపూజ, గ్రామోత్సవం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో రావాలని కోరారు.

ఘనంగా గంగమ్మతల్లి కొలుపు

రాపూరు: రాపూరు పంచాయతీ పరిధిలోని నవాబుపేటలో గంగమ్మతల్లి కొలుపు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శనివారం రాత్రి గంగపెట్టె ఊరేగింపు చేశారు. ఆదివారం అమ్మవారికి వివిధ పూజలు చేశారు. అమ్మవారి గంగపెట్టె ఊరేగింపు సమయంలో యువకులు, పెద్దల నృత్యాల నడుమ గ్రామంలోని పుర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో తలపై పొంగళ్లు పెట్టుకుని మంగళవాయిద్యాల నడుమ బొల్లి ఆవులు, బొల్లి ఎద్దుల విగ్రహాలతో ఊరేగింపుగా గ్రామ ప్రధాన వీధుల్లో సాయంత్రం అమ్మవారి ఆలయానికి వెళ్లారు.

అపూర్వ సమ్మేళనం



గురువు నారాయణరావును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఉదయగిరి రూరల్ : మండలంలోని బిజ్జంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1995–96 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం జరిగింది. యోగక్షేమాలు తెలుసుకుని అలనాటి జ్ఞాపకాలను నెమరేసుకుని ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా అప్పటి ప్రధానోపాధ్యాయుడు ఎస్వీ నారాయణరావును సన్మానించారు. అనంతరం ఎంఈఓ–2 తోట శ్రీనివాసులు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు తమ పాఠశాలను మర్చిపోకుండా ఆత్మీయ సమావేశాలు నిర్వహించుకోవడం సంతోషకరమన్నారు. హెచ్ఎం నాయబ్‌రసూల్, పూర్వ విద్యార్థులు జనార్దన్‌రెడ్డి, సురేంద్ర, జయరామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, లక్ష్మీదేవి, సురేష్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర



కావలి (జలదంకి): కావలి పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర ఆదివారం అత్యంతం వైభవంగా జరిగింది. స్థానిక మున్సిపల్ గ్రౌండ్ నుంచి పురవీధుల గుండా ముసునూరు ఆంజనేయస్వామి గుడి వరకు యాత్ర సాగింది. కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి శోభాయాత్రలో పాల్గొన్నారు. విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్, బీజేపీ అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో జరిగిన శోభాయాత్రలో వేలాదిగా హిందూ ప్రజలు పాల్గొని, జై హనుమాన్, జై శ్రీరామ్ నినాదాలు చేశారు.

కాలువ ఇలా.. మురుగు పారేదెలా?



పూడిపోయిన డ్రైయినేజీ కాలువ



నిలిచిన మురుగునీరు

దగదర్తి : మండలంలోని ఉలవపాళ్ల పంచాయతీలో మురుగునీరు పారుదల సరిగ్గా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో నివాసాల్లోని మురుగునీరు రోడ్లపైకి వస్తున్నాయి. దీంతో ఇరుగు పొరుగు వారికి తరచూ వివాదాలు తలెత్తుతున్నాయి. అంతేగాక మురుగునీరు పారకపోవడంతో దోమలు, ఇతర కీటకాలు వృద్ధి చెంది జ్వరాలు ప్రబలుతున్నాయి. గ్రామంలో రెండు డ్రెయినేజీ కాలువలు ఉండగా, ఒకటి చాలా కాలంగా పూడిపోయి ఉంది. దీంతో మురుగునీరు నిల్వ చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు లేవు. కాగా గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఇక్కడ కనీసం డ్రెయినేజీ కాలువలు కూడా లేవు. అధికారులు గ్రామంలో పర్యటించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.